# తెలుగుప్రభ

మన భాష.. మన పత్రిక


వైబ్రెంట్ ఎడిషన్ 1 pm

గురువారం 13-7-2023

teluguprabha.net -TeluguPrabha @TeluguPrabhaofficial


## ఫ్రాన్స్ పర్యటనకు ప్రధాని

**తెలుగు ప్రభ, హైదరాబాద్( జూలై 13)**




ప్రధానమంత్రి నరేంద్రమోదీ రెండు రోజుల ఫ్రాన్స్ పర్యటనకు బయలు దేరి వెళ్లారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మాక్రన్, తదితర ప్రతినిధులతో జరిగే చర్చలు ఫలప్రదం కావాలని ఆశిస్తున్నట్లు ట్విట్టర్ ద్వారా పేర్కొన్నారు. ప్రధాని తన పర్యటనలో సైనిక, వ్యూహాత్మక ఒప్పందాలు,ఉక్రెయిన్ – రష్యా సంక్షోభం, తదితర అంశాలపై చర్చించే అవకాశాలున్నాయి.

## లేటెస్ట్ న్యూస్

## శ్రీవారి సేవలో నితిన్ గడ్కరీ


**తెలుగుప్రభ, తిరుపతి(జూలై 13):**



నేషనల్ హైవేలను జాతికి అంకితం చేసే కార్యక్రమాల్లో పాల్గొనేందుకు తిరుపతికి వచ్చిన కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఇవాళ ఉదయం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు.శ్రీవారి తోమాల సేవలో పాల్గొన్నారు. కుటుంబంతో కలిసి వెంకటేశ్వరున్ని దర్శించుకోవడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. దేశం సుభిక్షంగా, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని దేవుణ్ని కోరుకున్నట్లు తెలిపారు.

## అటు మరణం.. ఇటు జననం..

### హృదయ విదారకం



**తెలుగుప్రభ, హైదరాబాద్(జూలై13):** ఇదో హృదయవిదారక ఘటన. వనపర్తి జిల్లా శ్రీరంగాపురం మండలం శేర్‌పల్లి సర్పంచ్ సునీత, బీఆర్‌ఎస్ నాయకుడు రాజశేఖర్ దంపతులకు చాలాకాలం వరకు సంతానం కలుగలేదు. చాలాకాలం తర్వాత గర్భం దాల్చిన సునీతకు పురిటినొప్పులు రావడంతో మంగళవారం కొల్లాపూర్‌లోని ఆస్పత్రిలో చేర్పించారు. ఇటీవల అనారోగ్యానికి గురైన రాజశేఖర్ హైదరాబాద్‌లో పరీక్షలు చేయించుకోగా రెండు కిడ్నీలు ఫెయిలైనట్లు గుర్తించడంతో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం రాత్రి రాజ శేఖర్ మరణించారు. బుధవారం ఉదయం సునీత మగబిడ్డను ప్రసవించింది. రాజేశేఖర్ మరణవార్తను చెబితే సునీత తట్టుకోలేదని భావించిన కుటుంబసభ్యులు ఆమెకు ఆ విషయం చెప్పలేదని సమాచారం.

## చీర ధర రూ. 21 లక్షలు

**తెలుగుప్రభ, హైదరాబాద్(జూలై 13):<**

ఉత్తరప్రదేశ్ లక్నోలోని ఓ వస్త్రదుకాణంలోని చీర ప్రస్తుతం వార్తల కెక్కింది. శ్వేతవర్ణంలోని చీర అంచులు ప్రత్యేక డిజైన్లతో కూడిన అది అందరి మనసులను కట్టి పడేస్తోంది. హస్తకళానైపుణ్యంతో ప్రత్యేకంగా తీర్చిదిద్దిన ఆ చీరను కొనలేకపోయినా.. కనీసం చూడనైనా చూద్దామని పలువురు మహిళలు బారులు తీరుతున్నారు. ఇంతకీ ఆ చీర ధర ఎంతోతెలుసా? రూ. 21 లక్షలు.



## మొదలైన ఓట్ల యుద్ధం

### ప్రచారాస్త్రంగా కరెంటు మంటలు

### ఈ మంటలిక ఆరతాయా.. ఎన్నికలదాకానా



**ఆ పార్టీ, ఈ పార్టీ అనే తేడా లేకుండా అన్ని పార్టీలూ ఎన్నికల యుద్ధానికి సిద్ధమయ్యాయి. వచ్చిన ప్రతి అవకాశాన్నీ, ప్రతి అంశాన్నీ ఓట్ల చూపుతో చూడటం ప్రారంభించాయి. ఇరవైనాలుగు గంటల ఉచిత కరెంట్‌పై బీఆర్‌ఎస్ – కాంగ్రెస్‌ల మధ్య చెలరేగిన మంటలు గురువారం కూడా కొనసాగుతూనే ఉన్నాయి.**

**తెలుగుప్రభ, హైదరాబాద్(జూలై13):**

రాష్ట్రంలోని సబ్‌స్టేషన్ల ముందు కాంగ్రెస్ పార్టీ.. ఆపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మల దహనాలు,ఉరితీతల కార్యక్రమాలు చేపట్టారు. సాయంత్రం రైతులతో ధర్నా కార్యక్రమాలకు సిద్ధమయ్యారు. మరోవైపు బీఆర్‌ఎస్‌ను తిప్పికొడుతూ కాంగ్రెస్ నేతలు ఇప్పటికే ఉచిత కరెంట్‌ను ప్రారంభించిందే తామని, పేటెంట్ తమదేనని వాదించడంతోపాటు నిజంగా రాష్ట్రంలో 24 గంటల ఉచిత కరెంటు అమలు కావడం లేదని, నిరూపిస్తే దేనికైనా సిద్ధమనే రీతిలో మాట్లాడారు. వాస్తవానికి ఈ పార్టీలకు ప్రజలపై, ముఖ్యంగా రైతులపై ప్రేమతోనే ఇన్ని కార్యక్రమాలు చేస్తున్నారా ? అంటే కాదనే చెప్పాలి. త్వరలోనే అసెంబ్లీ ఎన్నికలు ఉండటమే ఇందుకు కారణమని



ఎవరినడిగినా చెబుతారు. వారి ఓట్ల కోసం అవకాశం వచ్చిన ప్రతి సందర్భాన్నీ, ప్రతి అవకాశాన్నీ తమకు అనుకూలంగా మలచుకోవడం రాజకీయపార్టీలకు, నేతలకు కొత్తేమీ కాదు. తమకు వచ్చే ఓట్లపై ప్రభావం చూపుతాయని భావిస్తే తిప్పికొట్టడమూ సహజమే. ప్రస్తుతం రాష్ట్రంలో కరెంట్ మంటలు ఇంకా ఆరకపోవడానికి అదే కారణం.

రేవంత్‌రెడ్డి అమెరికా నుంచి వచ్చాక వ్యాఖ్యలపై స్పష్టత వస్తుందని కొందరు కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. ఎటొచ్చీ రాబోయే ఎన్నికలకు కరెంట్ అంశం రెండు పార్టీలకూ మంచి ప్రచారాస్త్రంగా మారింది.ఇక ఈ వ్యవహారంలో తానెందుకు తలదూర్చడం అన్నట్లు కాబోలు బీజేపీ మౌనముద్ర దాల్చింది. రాష్ట్రంలో తిరిగి అధికారంలోకి వచ్చేది.. హ్యాట్రిక్ కొట్టేదీ తామేనని ధీమాగా ఉన్న బీఆర్ఎస్.. రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను దింపి ప్రజలు తమకే పట్టం కడతారని భావిస్తున్న కాంగ్రెస్‌ల మధ్య అంటుకున్న ఈ కరెంటు మంటలు ఇప్పట్లో ఆరిపోతాయా లేక ఎన్నికల దాకా కొనసాగనున్నాయా ? అన్నది వేచి చూడాల్సిందే!

## ఉగ్రవాదులకు జైలు శిక్ష

### హైదరాబాద్‌లో పేలుళ్లకు కుట్ర

**తెలుగుప్రభ, హైదరాబాద్ (జూలై 13)**

గోకుల్ ఛాట్, లుంబినీ పార్క్, దిల్‌సుఖ్ నగర్ పేలుళ్లతో పాటు.. దేశ వ్యాప్తంగా పేలుళ్లకు కుట్రపన్నిన ఇండియన్ ముజాహిద్దీన్ తీవ్రవాదులకు పదేళ్ల జైలు శిక్ష పడింది. హైదరాబాద్, ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో పేలుళ్లకు నిందితులు రెక్కీ నిర్వహించారని జాతీయ దర్యాప్తు సంస్థ చేసిన వాదనలతో సదరు కోర్టు ఏకీభవించింది. పేలుళ్ల కోసం నిందితులు ఆయుధాలు, ఆయుధ సమాగ్రిని సైతం సమకూర్చుకున్నారని దర్యాప్తు సంస్థ పేర్కొంది. హైదరాబాద్‌కు చెందిన ఒబేద్ రహమాన్, బీహార్‌కు చెందిన ధనిష్ అన్సారీ, అఫ్తాబ్ ఆలమ్, మహారాష్ట్రకు చెందిన ఇమ్రాన్ ఖాన్ని పేలుళ్ల కుట్ర కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ 2013 మార్చిలో అరెస్ట్ చేసింది. జులై 7న వీరిని దోషులుగా నిర్ధారించిన ఎన్ఐఏ కోర్టు.. గురువారం 10 ఏళ్ల జైలు శిక్ష విధించింది. అంతేకాక డానిష్ అన్సారీకి రూ. 2,000, అఫ్తాబ్ ఆలమ్‌కు రూ. 10,000 జరిమానాను కూడా విధిస్తూ ప్రత్యేక న్యాయమూర్తి శైలేందర్ మాలిక్ తీర్పునిచ్చారు. ఇండియన్ ముజాహుద్దీన్ తీవ్రవాదులతో కలిసి దేశంలోని పలు చోట్ల పేలుళ్లకు ఈ నలుగురు కుట్ర పన్నినట్లు ఎన్ఐఏ గుర్తించింది. 2007లో జరిగిన గోకుల్ చాట్, లుంబినీ పార్కు జంట పేలుళ్లు.. అలాగే 2013 నాటి దిల్‌సుఖ్‌నగర్ జంట పేలుళ్లలో వీరి పాత్ర ఉందని ఛార్జ్‌షీట్‌లో పేర్కొంది. ఇవే కాక గతంలో వారణాసి, ముంబై, ఫజియాబాద్, ఢిల్లీ, అహ్మదాబాద్, బెంగళూర్‌లో జరిగిన పేలుళ్లలోనూ ఈ నలుగురి పాత్ర ఉందని తెలిపింది. అయితే ఈ కేసులలో మొత్తం 11మంది నిందితులుగా ఉండగా.. మిగిలిన ఏడుగురు నిందితుల్లో యాసిన్ బత్కల్, అక్తర్, రెహమాన్, తెహసిన్ అక్తర్, హైదర్ అలీ, రియాజ్ బత్కల్‌తో పాటు మరో నిందితుడు ఉన్నాడు.







## కాంగ్రెస్‌కు నో ఎంట్రీ

**తెలుగుప్రభ, హైదరాబాద్(జూలై13):**

ఉచిత విద్యుత్తుపై రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై రైతులు భగ్గుమంటున్నారు. 'కాంగ్రెస్ పార్టీకి మా గ్రామంలో ప్రవేశం లేదు' అంటూ ఆయా గ్రామాల్లో రైతులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. కరీంనగర్ జిల్లాలోని కరీంనగర్, కొత్తపల్లి మండలాల్లోని పలు గ్రామా ల్లో బుధవారం పెద్ద సంఖ్యలో ఫ్లెక్సీలు వెలిశాయి. రైతులే స్వయంగా వీటిని ఏర్పాటు చేస్తున్నారు. సాగుకు 3 గంటల విద్యుత్తు సరిపోతుందన్న రేవంత్‌రెడ్డితోపాటు కాంగ్రెస్ నాయకులు తమ గ్రామాల్లోకి రావొద్దని స్పష్టం చేస్తున్నారు. ఈ ఫ్లెక్సీలు మొదట కొత్తపల్లి మండలం చింతకుంట వద్ద కరీంనగర్–సిరిసిల్ల ప్రధాన రహదారిపై స్థానిక రైతులు ఏర్పాటు చేశారు. ఇదే స్ఫూర్తితో బద్దిపల్లి, బావుపేట, ఖాజీపూర్ గ్రామాల్లో, ఇటు కరీంనగర్ రూరల్ మండలంలోని బొమ్మకల్, కొత్తపల్లి మండలం కమాన్‌పూర్, ఎలగందుల తదితర గ్రామాల్లోనూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఇలాంటి ఫ్లెక్సీలు రాష్ట్రమంతటా ఏర్పాటయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

## సంగారెడ్డిలో దారుణం

### గర్భిణికి ఓ ఇంజెక్షన్ బదులు మరొకటి ఇవ్వడంతో...

**తెలుగుప్రభ, సంగారెడ్డి (జూలై 13)**

**ఓ ప్రైవేటు ఆస్పత్రి నిర్వాకంతో ఓ గర్భిణి తీవ్రమైన విషాదంలో మునిగిపోయింది. కడుపులోనే బిడ్డ చనిపోవడంతో కన్నీరుమున్నీరు అవుతోంది.**


జహీరాబాద్ పరిధిలోని ఝరసంగం మండలం కంబాలపల్లి గ్రామానికి చెందిన షాహీర్ బేగం అనే గర్భవతి మొదటి నుంచి సంగారెడ్డి లోని స్థానిక లలిత సంతాన సాఫల్య కేంద్రం అనే హాస్పిటల్ లో చికిత్స తీసుకుంటోంది. ప్రస్తుతం ఎనిమిదవ నెల గర్భంతో ఉన్న షాహేరా బేగం ఎప్పటిలాగే చికిత్స తీసుకోవడానికి మంగళవారం సాయంత్రం లలిత హాస్పిటల్ కి వచ్చింది. అయితే ఆమెకు చికిత్స చేసిన ఆసుపత్రి సిబ్బంది ఓ ఇంజక్షన్ కాకుండా వేరే ఇంజక్షన్ ఇవ్వడంతో తీవ్ర అస్వస్థతకు గురైంది. దీంతో సహేరా బేగం పరిస్థితి విషమంగా మారడంతో ఆందోళన చెందిన లలిత ఆసుపత్రి యాజమాన్యం గర్భిణీ కుటుంబ సభ్యులకు సైతం సమాచారం ఇవ్వకుండా హుటాహుటిన హైదరాబాద్ సిటిజన్ ఆసుపత్రికి తరలించారు. తీరా హైదరాబాద్ ఆసుపత్రికి వెళ్లిన బంధువులకు సంగరెడ్డిలోని లిలిత ఆసుపత్రిలో ఇంజక్షన్ తప్పుగా ఇవ్వడంతో కడుపులో ఉన్న శిశువు మృతి చెందింది అని చెప్పడంతో. షాహీరా బేగం కుటుంబ సభ్యులు.. బంధువులు సంగరెడ్డిలోని లలిత ఆసుపత్రి ముందు అర్థరాత్రి వరకు ఆందోళన నిర్వహించారు..తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గర్భంలోనే శిశువు మృతి చెందడంతో పాటు గర్భిణీ పరిస్థితి కూడా విషమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కాగా బాధితులు ఈ విషయాన్ని జిల్లా మంత్రి హరీష్ రావుకు సమాచారం చేరవేయడంతో. స్పందించిన మంత్రి హరీష్ రావు ప్రస్తుతం గర్భిణీ శహేరా బేగం చికిత్స పొందుతున్న సిటిజన్ ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి మంచి చికిత్స అందజేయాలని ఆదేశించారు.



## మంత్రి మల్లారెడ్డి స్టైల్లో..

**తెలుగుప్రభ,హైదరాబాద్(జూలై13):**

నేనేమైన మాయ చేసిన్నా ? మంత్రం జేసిన్నా ? నేను కష్టపడ్డా.. పాలమ్మినా..పూలమ్మినా ..స్కూల్స్‌పెట్టినా.. కాలేజీలునడిపించినా.. అని రాష్ట్రమంత్రి మల్లారెడ్డి స్టైల్‌లో నవీన్ పొలిశెట్టి విద్యార్థులను హుషారెక్కించారు. తనకొత్త సినిమా' మిస్ శెట్టి.. మిస్టర్ పొలిశెట్టి' ప్రచార కార్యక్రమాల్లో భాగంగా మేడ్చల్‌లోని సీఎంఆర్ కాలేజీలో విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. కష్టపడ్డా.. స్కిట్లు రాసినా..యూట్యూబ్‌లో వీడియోలు తీసినా ఇంజినీరింగ్ చదువుతానని చెప్పి అమ్మానాన్నల చెవుల్లో పూలు పెట్టినా.. ఎందుకు ? ఎందుకూ..? అంటూ మల్లారెడ్డిని అనుకరించడంతో విద్యార్థులు ఈలలు , గోలలతో చప్పట్లు కొట్టారు.



## వరద కల్లోలం.. కకావికలం

**తెలుగుప్రభ, న్యూఢిల్లీ (జూలై 13)**

వరదల్లో చిక్కుకుంటున్న విలవిలలాడిపోతున్నారు. విరుచుకుపడుతున్న విరుణుడి ప్రతాపానికి ఆ ప్రాంతాలు కకావికలం అలవుతున్నాయి. జనం భయం గుప్పిట గడుపుతున్నారు. ప్రధానంగా రాజధాని ఢిల్లీ కూడా వణికిపోతోంది. యమునా నది మహోగ్రరూపాన్ని చూసి అల్లాడిపోతోంది. వరద నీరు రికార్డు స్థాయిలో పోటెత్తుతుండడంతో ఎప్పుడు ఏం జరుగుతుందో అన్న భయం స్థానికులను వెంటాడుతోంది. ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సమీపంలోకి వరద చేరిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. యమునా నది ప్రమాదకర స్థాయి కంటే మూడు మీటర్లు ఎగువన ప్రవహిస్తోంది. యమునా నది ఈ స్థాయిలో ప్రవహించడం చరిత్రలో ఇదే తొలిసారి. 1978లో నీటి మట్టం 207.49 మీటర్లకు చేరడంతో ఢిల్లీని భారీ వరదలు ముంచెత్తాయి. ఇప్పుడు ఆ రికార్డును కూడా దాటడంతో అటు అధికారులు, ఇటు ప్రజలు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

మరోవైపు ఢిల్లీలోని పాత రైల్వే వంతెనే వద్ద యమునా నది నీటి మట్టం ప్రమాదకర స్థాయికి చేరింది. యమునా ఉప్పొంగడంతో సమీప ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. ప్రధాన రహదారులన్నీ నదులను తలపిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాల ఇళ్లలోని నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సివిల్ లైన్స్ ప్రాంతంలో రింగ్ రోడ్డు పూర్తిగా నీటమునిగింది. కశ్మీరీ గేట్ – మంజు కా తిలాని కలిపే ప్రాంతంలో భారీగా వరద చేరి వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.



### వరదలతో వెళ్లలేక..

### ఆన్‌లైన్‌లో పెళ్లి

తెలుగుప్రభ, హైదరాబాద్(జూలై13):

హిమాచల్‌ప్రదేశ్‌లో ఆగకుండా కురుస్తున్న వర్షాలతో ప్రయాణం చేయలేక ఓ జంట ఆన్‌లైన్ ద్వారానే పెళ్లి చేసుకుంది. రాష్ట్రంలో భారీ వర్షాలతో పలు ప్రాంతాల మధ్య సంబంధాలు తెగిపోయాయి. రాకపోకలు నిలిచిపోయాయి. ఈనెల పదో తేదీన సిమ్లాలోని కోట్‌గఢ్‌కు చెందిన ఆవిష్‌సిన్హా,భుంటార్‌లోని కుల్లుకు చెందిన శివానీ ఠాకూర్‌ల పెళ్లి జరగాల్సి ఉండగా, పెళ్లి మంటపానికి చేరుకోలేని పరిస్థితి ఎదురైంది.దాంతో ఇరుకుటుంబాల పెద్దలు మాట్లాడుకొని ముహోర్తానికి ఎలాగైనా పెళ్లి కావాలని భావించి ఆన్‌లైన్ ద్వారానే పెళ్లి కార్యక్రమాన్ని జరిపించారు.